కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

- నెలరోజులుగా పేరుకుపోతున్న ధాన్యపు రాశులు
- అకాలవర్షాలతో తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్న రైతులు
- త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్


రుద్రంగి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

రుద్రంగి: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, గన్నీ సంచులు, లారీల కొరత, పలు కారణాలతో కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. తేమశాతం వచ్చినా నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం పేరుకుపోతోంది. అకావర్షాలకు ధాన్యం తడిసి మళ్లీ ఆరబెట్టే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారు. దళారులకు ధాన్యం విక్రయించి వేలల్లో నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కొనుగోళ్ల కేంద్రాల్లో ధాన్యం విక్రయాలపై దృష్టిసారించి,త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

తక్కువ ధరకే విక్రయం

ఓవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు నెమ్మదిగా సాగడం, మరో వైపు ఖరీఫ్ వ్యవసాయ పనులు సమీపిస్తుండటంతో రైతులు ధాన్యాన్ని తొందరగా అమ్ముకొని వ్యవసాయ పనులకు వెళ్లాలని దళారులను ఆశ్రయిస్తున్నారు. అదే అదునుగా భావిస్తూ దళారులు రైతులను నిండా ముంచుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

డబ్బులు వచ్చేదెప్పుడో?

గతంలో కొనుగోలు కేంద్రాలు లేని సమయంలో రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించేవారు. అయితే వారు నెలల తరబడి రైతులను తిప్పుకొని ఇచ్చేవారు. ధాన్యం డబ్బులు ఎప్పుడు వస్తాయో? అసలు దళారులు ధాన్యం డబ్బులు ఇస్తారా ఎగబెడతారా..? అని మదన పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అయితే 20 రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమయ్యేవని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోళ్లపై దృష్టిసారించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు కట్కూరి లక్ష్మి. రుద్రంగికి చెందిన ఈమె తన కున్న ఎకరంన్నర పొలంలో పండించిన ధాన్యాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో పోసింది. 20 రోజుల క్రితం తేమశాతం వచ్చినా తూకం వేయలేదు. అకాలవర్షాలకు తడుస్తుండటంతో చివరికి దళారులకు తక్కువ ధరకు విక్రయించింది. కొనుగోలు కేంద్రంలో కంటే దాదాపు రూ.8,400 వరకు తక్కువ వచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేస్తోంది.



రుద్రంగికి చెందిన ఈ రైతుపేరు చెప్యాల గంగారాం. తనకున్న రెండు ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో పోశాడు. 25 రోజుల క్రితం తేమశాతం రాగా ధాన్యం కుప్పపోశాడు. వర్షాలు, కురుస్తుండటం, వానాకాలం సమీపిస్తుండటంతో చివరికి దళారులకు తక్కువ ధరకు విక్రయించాడు. ఈ ఇద్దరు రైతులే కాదు కొనుగోలు కేంద్రాల్లోని రైతులందరిదీ ఇదే పరిస్థితి.

దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. రెండ్రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్ వచ్చి లారీల కొరత లేకుండా త్వరగా ధాన్యం విక్రయాలు జరపాలని ఆదేశించారు. కొనుగోలు త్వరగా పూర్తిచేస్తాం. రైతులు దళారులను ఆశ్రయించొద్దు.

– శ్రీలత, తహసీల్దార్, రుద్రంగి

సదరం సర్టిఫికెట్‌ను సవరించండి


సదరం సర్టిఫికెట్‌ను సవరించాలని కోరుతున్న లక్ష్మి

సిరిసిల్లటౌన్: ఎంతకూ తగ్గని రోగంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన తనను అధికారులు పట్టించుకోవడం లేదని సిరిసిల్లకు చెందిన కూస లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి సభ్యుల సహకారంతో ఆదివారం తన గోసను మీడియాకు వెళ్లబోసింది. తాను నరాల బలహీనతతో బాధపడుతున్నానని పేర్కొంది. చాలా రోజుల క్రితం సదరం సర్టిఫికెట్‌లో వైకల్యం కేవలం ఐదు శాతమే ఇచ్చారని పేర్కొంది. తన భర్త శంకర్ గతంలో వంటలు చేస్తూ ఉపాధి పొందేవాడని, ఇప్పుడు వయస్సు మీదపడి ఇరువురం ఇంట్లోనే అచేతన స్థితిలో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. సంతానం లేని తమకు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్‌లో తక్కువ పర్సెంటేజీ ఉన్న వైకల్యాన్ని పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది. తద్వార ప్రభుత్వం నుంచి వచ్చే సాయంతో జీవితం వెళ్లదీసుకుంటామని కంటతడి పెట్టింది. బాధితుల సమస్యపై అధికారులు వెంటనే స్పందించాలని సిరిసిల్ల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చిప్ప దేవదాసు, పోతు రమేశ్, సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్ కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి: మండలంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో విలేకరులతోమాట్లాడారు. లారీల కొరతతో ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే పేరుకుపోయాయన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ, ఎకరాకు రూ. 15వేల రైతుభరోసా తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు ఉదారి నర్సింహాచారి, ఎడపల్లి పర్శరాం, అశోక్, అమిరిశెట్టి గంగయ్య, కల్యాణం అనిల్, బొటుకు తిరుపతి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కోనరావుపేట: సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమై చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

చందుర్తి: మండలంలోని మల్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను శాలువాలతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి, కోరుట్లపేట గ్రామాల్లో విద్యుత్ లైన్లకింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్ గౌడ్ ఆదివారం తెలిపారు. రెండు గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 25లోపు పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో మహిళలు పోచమ్మకు బోనాలు సమర్పించారు. మంగళవారం రేణుకాదేవి కల్యాణం, పెద్ద పట్నం, గావు పట్టుట, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామివారికి అభిషేకం, విష్వక్సేరాధన, రక్షా బంధనం, నవ బ్రహ్మ కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 21న కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఘన నివాళి


తంగళ్లపల్లిలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తంగళ్లపల్లి: సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య జీవితం ఆదర్శప్రాయమన్నారు. మండల నాయకులు కడిక్యాల కనకయ్య, అన్నల్‌దాస్ గంగాధర్, లింగంపెల్లి కృష్ణవేణి, కోడం వేణు, సామల నర్సయ్య, అవధూత హరిదాసు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండల సీపీఎం నాయకులు నిర్వహించారు. సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడారు. రైతుసంఘం అధ్యక్షుడు వివిధ కార్మిక సంఘాల నాయకులు శంకరయ్య, లచ్చయ్య, బాబు, రాజలింగం, పొత్తూరి నర్సయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జవ్వాజి విమల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అరించారు. సభ్యులు బుచ్చయ్య, నర్సవ్వ, పోశవ్వ, సులోచన, పావని, గాయత్రి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లోనే చెత్త..



తంగళ్లపల్లి: సర్పంచుల పదవికాలం ముగియగానే ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో స్వచ్ఛత లోపించిందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో అధికారులకు చెత్తపై చిత్తశుద్ధి లేకుండా పోయిందని బాహంటాగానే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

క్లుప్తంగా

రైతులకు బోనస్ చెల్లించాలి

ముస్తాబాద్: రైతు సమస్యలను వెంటనే పరిష్కరించి, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు దోపిడీకి గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్‌గా తూకం వేస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదనంగా ధాన్యం తూకం వేస్తూ రైతులను దోపిడీకి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించేందుకు బీజేపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంలోని మిడ్‌మానేరు ముంపు గ్రామ నిర్వాసితులకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో తేనేటీగల పెంపకం, ఇతర ఉపాధి అవకాశాలపై ఆదివారం అవగహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు ఇంద్రారెడ్డి, రామచంద్రయ్య మాట్లాడుతూ యువత తేనే పెంచి అమ్మడం ద్వారా మంచి ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, మాజీ సర్పంచులు రాంరెడ్డి, పిల్లి రేణుక కనుకయ్య, మాజీ ఎంపీటీసీ వంకాయల భూమయ్య, మెడికల్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వీర్నపల్లి: మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్, ఇతర బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని, ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయాలని మండల ప్రజలకు ఎస్సై సూచించారు.

ఘనంగా బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో ఆదివారం పోలేరమ్మ బోనాలు తీశారు. శనివారం బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మకు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మంగారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటినుంచి క్రీడాపోటీలు

రుద్రంగి: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో రుద్రంగి పోలీస్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు సోమవారం ప్రారంభమవుతాయని ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలకు గ్రామానికి ఒక కబడ్డీ, వాలీబాల్ టీంకు అవకాశం ఇస్తున్నామని ఆసక్తి గల క్రీడాకారులు టీం వివరాలను పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 9492195025 నంబర్‌లో సంప్రదించాలన్నారు. మండల ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన రెండుజట్లను జిల్లాస్థాయికి ఎంపికచేయనున్నట్లు తెలిపారు.

ఎల్లమ్మ సిద్ధోగానికి ఏర్పాట్లు



గంభీరావుపేట: మండలకేంద్రంలో ఎల్లమ్మ సిద్ధోగానికి గౌడసంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో ఎల్లమ్మ గడ ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నారు. రేణుకాదేవి–జమదగ్ని వార్షిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 26న కల్యాణం, పోచమ్మ బోనాలు, 27న ఏడంత్రాల బోనాల ఊరేగింపు, నల్ల పోచమ్మ బోనాలు, 28న ఎల్లమ్మ బోనాల ఊరేగింపు, పట్నాలు వేయుట నిర్వహించనున్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్‌లోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందిన చౌకి వరలక్ష్మి (75)కి నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్టు నిర్వాహకుడు గడ్డం తిరుమల శ్రీనివాస్, కృష్ణవంశీ, దిలీప్‌కుమార్, కనుకమ్మ, పురుషోత్తం, దంజయ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి: శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తూ సమాజ రక్షణ కోసం పోలీసులు పనిచేస్తున్నారని చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మూడపల్లిలో ఆదివారం రాత్రి 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, సమస్యలకు భయపడి ఆత్మహత్యలు చేసుకుంటే పరిష్కారం కావన్నారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా పోలీసుస్టేషన్‌కు వస్తే పరిష్కరిస్తారన్నారు. వర్షాకాలంలో రైతులు పొలాల వద్దకు వెళ్లినప్పుడు, ఉరుములు, పిడుగులు పడే సమయంలో చెట్లకిందికు వెళ్లవద్దని సూచించారు. రైతులు కొనుగోలు చేసి విత్తనాలకు దుకాణాదారుల నుంచి బిల్లులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎక్కడైనా విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న చెన్నమనేని వికాస్‌రావు

రుద్రంగి: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ప్రకృతి వైపరీత్యం కాదని, ప్రభుత్వ వైఫల్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్, 2 లక్షలు రుణమాఫీ, 15 వేలు పంట పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని, లేదంటే రైతుల పక్షాన పెద్దఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

వందశాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి


తంగళ్లపల్లి: చివరి ధాన్యం లోడును మిల్లుకు తరలిస్తున్న వెంకటరమణా రెడ్డి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వందశాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని వైస్ చైర్మన్ ఎగమామిడి వెంకట రమణా రెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి చివరి ధాన్యం లోడును రైస్‌మిల్‌కు తరలించారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో 120 మంది రైతుల వద్ద నుంచి 8,100 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మండలవ్యాప్తంగా సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా ఇప్పటివరకు 13 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 1139 మంది రైతులకుగాను 1.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లుకు తరలించినట్లు చెప్పారు. కొనుగోళ్లకు సహకరించిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో అల్మాస్‌పూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డు స్థాయిలో రైతులనుంచి ధాన్యం సేకరించి ఆదివారం పూర్తి చేసినట్లు సంఘం డైరెక్టర్లు ఖానాపురం లక్ష్మణ్, బట్టు రాజుయాదవ్, మొగుళ్ల శ్రీనివాస్‌యాదవ్, సీఈవో సతీశ్‌లు తెలిపారు. రైతుల నుంచి తూకం వేసిన ధాన్యం చివరి బస్తాలను లారీలో లోడ్‌వేసి మిల్లుకు తరలించినట్లు పేర్కొన్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



వీర్నపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను వెంబడిస్తూ పలువురిని గాయపరుస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టించుకొని కుక్కల బారినుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

వలస కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిపేట: దుబాయి పర్యటనలో ఉన్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను దుబాయి ఈటీసీఏ అధ్యక్షుడు రాధారపు సత్యం ఆదివారం అక్కడ మార్యాదపూర్వకంగా కలిశారు. ఆది శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. దుబాయిలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్యం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సంక్షేమమం కోసం ఎన్నారై పాలసీని ప్రభుత్వం అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కొన్నేళ్లుగా వివిధ కారణాలతో దుబాయి జైలులో ఉన్న వారిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో వలస కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

కొనుగోళ్లలో నిర్లక్ష్యం

గంభీరావుపేట: వరి కోతలు కోసినెల రోజులు గడిచినా ఇప్పటికీ ధాన్యం కల్లాల్లోనే ఉన్నాయని, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేశ్ అన్నారు. కల్లాల్లో ధాన్యం మొలకెత్తుతోందని, ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ. 500 బోనస్ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ శ్రీ కృష్ణ కురుమ యాదవ సంఘం కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగినట్లు సంఘ నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా ఒల్లెం కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా ఏనుగుల కొమురయ్య, కోశాధికారిగా ప్రశాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల మహేశ్, సంయుక్త కార్యదర్శిగా సంబ మహేశ్, సలహాదారులుగా ఏనుగుల కనుకయ్య, బొప్పెన రాజు, గొట్ల కనుకయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

వెంకట్‌రెడ్డికి సన్మానం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డికి అమెరికన్ డాక్టరేట్ అవార్డు రావడంపై ఆయనను స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. వెంకట్‌రెడ్డి చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన అమెరికన్ సంస్థ డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈనెల 25న న్యూఢిల్లీలో ఆయన అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా అతడిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.